క్లుప్తంగా

గౌడ సంఘం కులపెద్దల ఎన్నిక



మంగపేట : మండలంలోని బుచ్చంపేట గ్రామంలోని గౌడ కులసంఘం పెద్దల నూతన కమిటీని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సంఘం అధ్యక్షులు, కులపెద్దగా గ్రామానికి చెందిన గడ్డం పరమేష్, కార్యదర్శిగా బంటు రాములు, కోశాధికారిగా పిట్టల సాంబయ్య, సహాయ కార్యదర్శిగా మండల ఉప్పలయ్య, కార్యవర్గ సభ్యులుగా నక్క శ్రీను, పిట్టల సత్యం, డీకొండ నవీన్, నన్నెబోయిన నగేష్, ముట్టెం కృష్ణ, సలహాదారులుగా మల్లయ్య, ముట్టెం నారాయణ, గడ్డం శ్రీహరి, బండపెల్లి అంజయ్యను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థికసాయం



మంగపేట : మండలంలోని తిమ్మంపేట గ్రామంలో ఇటీవల మృతి చెందిన బోడ ఎర్రసమ్మయ్య కుటుంబానికి ప్రజాసేవ చారిటబుల్ ట్రస్టు చైర్మన్ గుడివాడ శ్రీహరి రూ.2000 నగదును ఆర్థిక సాయంగా ఆదివారం అందజేశారు. బుధవారం బాధిత కుటుంబాన్ని ఆయన పరామర్శించి నగదు, బియ్యంను మృతుడి కుమారుడు ప్రవీణ్‌కు అందచేశారు. పరామర్శించిన వారిలో ఎగ్గడి అర్జున్, బీస సాంబయ్య, కూకట్ల శ్రీనివాస్, సాధనపల్లి రవి, బోడ మహేష్, తదితరులు ఉన్నారు.

గుండెపోటుతో ప్రధానోపాధ్యాయుడి మృతి


రవీందర్(ఫైల్)

కన్నాయిగూడెం: మండలంలోని చింతగూడెం ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడిగా పనిచేస్తున్న కోరగట్ల రవీందర్(55) గుండె పోటుతో ఆదివారం మృతి చెందాడు. బంధువుల తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన రవీందర్ చింతగూడెం ప్రాథమిక పాఠశాలలో కొంతకాలంగా హెచ్‌ఎంగా పని చేస్తున్నాడు. ఆదివారం ఉదయం చాతిలో నొప్పి రావడంతో కుటుంబ సభ్యులు ప్రత్యేక వాహనంలో ఏటూరునాగారం ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు. మృతుడికి భార్య లక్ష్మి, పిల్లలు నందకిషోర్, శశివర్ధన్ ఉన్నారు.

రేపు తిరంగా యాత్ర

గోవిందరావుపేట : ఆపరేషన్ సిందూరు విజయవంతం చేసినందుకు ఆర్మీ జవాన్లకు సంఘీభావంగా ములుగు జిల్లా కేంద్రంలో ఈనెల 20న సాయంత్రం 5 గంటలకు తిరుమల టాకీస్ నుంచి తిరంగా యాత్ర ప్రారంభమవుతుందని బీజేపీ మండల అధ్యక్షుడు మార్క సతీష్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సకల జనులు, సబ్బండ వర్గాలు పార్టీలకతీతంగా హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. సైనికులకు అండగా మేమందరం ఉన్నాం అంటూ చాటి చేప్పే విధంగా ప్రతి ఒక్కరూ కూడా ఈ కార్యక్రమంలో పాల్గొనాలని అన్నారు.

పుష్కరఘాట్ వద్ద బెలూన్స్ ఏర్పాటు



చిట్యాల : కాళేశ్వరంలోని సరస్వతి పుష్కర ఘాట్ వద్ద మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు ఆదివారం బెలూన్స్ ఏర్పాటు చేశారు. భక్తులు పుష్కర ఘాట్ తెలుసుకునే విధంగా ఏర్పాటు చేశారు. ఈ మేరకు పలువురు భక్తులు పుష్కర ఘాట్ తెలువక అనేక ఇబ్బందులు పడుతుండగా.. విషయం తెలుసుకున్న మంత్రి శ్రీధర్ బాబు బెలూన్స్ ఏర్పాటు చేయించారు.

భక్తుల సందడి

భూపాలపల్లి అర్బన్ : మహాదేవపూర్ మండలం కాళేశ్వరంలో తాత్కాలిక బస్టాండ్ నుంచి సరస్వతి ఘాట్ వరకు ఏర్పాటు చేసిన స్పెషల్ షటిల్ సర్వీస్ బస్సుల వద్ద ఆదివారం తీవ్ర ఒత్తిడి వాతావరణం నెలకొంది. భక్తులు ఆదివారం అధిక సంఖ్యలో ఆర్టీసీ బస్సుల్లో కాళేశ్వరానికి చేరుకున్నారు. బస్టాండ్ నుంచి స్పెషల్ బస్సులను ఏర్పాటు చేశారు. తిరుగు ప్రయాణం ఘాట్ పార్కింగ్ పాయింట్ నుంచి బస్టాండ్ వరకు తిరిగి తీసుకున్నారు.

చెట్ల నీడలోనే నిరీక్షణ

- మండలంలో కానరాని బస్టాండ్
- బస్‌షెల్టర్లు లేక రోడ్డుపక్క చెట్ల కిందనే ప్రయాణికుల పడిగాపులు
- పట్టించుకోని ఆర్టీసీ అధికారులు


బుట్టాయిగూడెంలో బస్సు కోసం చెట్ల వద్ద కూర్చున్న ప్రయాణికులు

కన్నాయిగూడెం : మండలంలో ఆర్టీసీ బస్టాండ్ లేక ప్రయాణికులు చెట్లకింద నిరీక్షిస్తూ ఇబ్బందులకు గురవుతున్నారు. మండలం నుంచి వందల వాహనాలు, వందల కొద్దీ ప్రయాణికులు నిత్యం రాకపోకలు సాగిస్తుంటారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లా నుంచి పలిమెల, మహాదేవపూర్, మహాముత్తారం, కాళేశ్వరం, మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్ ప్రాంతాల నుంచి ప్రయాణికులు ఏటూరునాగారం, ములుగు, వరంగల్, హనుమకొండ, హైదరాబాదు, ఖమ్మం, భద్రాచలం సుదూర ప్రాంతాలకు రాకపోకలు సాగిస్తుంటారు. కానీ మండలంలో బస్టాండ్, బస్‌షెల్టర్లు లేక ప్రధాన రహదారి వెంట ఉన్న చెట్ల కింద ఉంచి బస్సుల రాకకోసం ఎదురుచూస్తుంటారు. అక్కడ సరైన సౌకర్యాలు తాగునీరు, నీడ లేక ఎండలో అవస్థలు పడుతున్నారు. ఆర్టీసీ అధికారులు వివిధ అధికారులకు ఆదాయ మార్గాలపై ఉన్న దృష్టి ప్రయాణికులకు కల్పించే సౌకర్యాల పై లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

నిత్యావసరాల కోసం ప్రయాణికుల రాకపోకలు

నిత్యం ప్రజలు అవసరాల నిమిత్తం ప్రయాణాలు సాగిస్తుంటారు. మండలంలో 11 గ్రామపంచాయతీలు ఉన్నాయి. జయశంకర్ భూపాలపల్లి జిల్లా నుంచి రోజుకు ఐదుసార్లు బస్సు సర్వీసులు మండలంలోని లక్ష్మీపురం జంక్షన్, కన్నాయిగూడెం, ఏటూరునాగారం రవాణా కొనసాగుతుంటాయి. ఛత్తీస్‌గఢ్ ,మహారాష్ట్ర నుంచి కూడా ప్రయాణికులు వివిధ ప్రాంతాలకు రవాణా సాగిస్తుండడంతో పాటు నిత్యం ప్రైవేట్ వాహనాల ద్వారా కూడా రవాణా కొనసాగుతుంది. దీంతో బస్టాండ్ లేక ప్రయాణికులు ఎండలో చెట్ల కింద ఉండి బస్సుల కోసం ఎదురుచూస్తుంటారు.


లక్ష్మీపురం జంక్షన్ వద్ద బస్సు కోసం ఎదురుచూస్తున్న ప్రయాణికులు

ఎండ భరించలేక ప్రైవేట్ వాహనాల్లో ప్రయాణం

ప్రయాణికులు ఆర్టీసీ బస్సుకోసం ఎదురు చూస్తుండగా ఎండ తీవ్రతను తట్టుకోలేక చాలా మంది ప్రయాణికులు అందుబాటులో ఉన్న ప్రైవేట్ వాహనాల్లో సాగిస్తున్నారు. మండల కేంద్రంలో, లక్ష్మీపురం జంక్షన్ వద్ద బస్టాండ్‌లు ఏర్పాటు చేయాలి. ప్రతీ గ్రామానికో బస్‌షెల్టర్ ఏర్పాటు చేసి తగిన సౌకర్యాలు ఏర్పాటు చేయాలని ప్రయాణికులు కోరుతున్నారు.

షెల్టర్లు లేక ఇబ్బందులు పడుతున్నాం



మండలంలో బస్టాండ్, బస్ షెల్టర్లు లేక ఎండల బస్సు కోసం ఎదురుచూస్తూ ఇబ్బందులు పడుతున్నాం. ఆర్టీసీ అధికారులు చర్యలు తీసుకొని కనీస సౌకర్యాలు ఏర్పాటు చేయాలి.

– బోనముక్కుల కాటన్‌రెడ్డి, కన్నాయిగూడెం

బస్టాండ్ ఏర్పాటు చేయాలి



కన్నాయిగూడెం మారుమూల ప్రాంతం కావడంతో చాలా మంది ప్రయాణికులు బస్సులో ప్రయాణం చేయడానికి ఇష్టపడుతుంటారు. మండల కేంద్రంలో , లక్ష్మీపురం వద్ద బస్ స్టేషన్‌లు, ప్రతీ గ్రామానికో బస్ షెల్టర్లు ఏర్పాటు చేయాలి.

– దుర్గం రాజుకుమార్, బుట్టాయిగూడెం

ప్రాజెక్టుల నిర్మాణంతో జిల్లా సస్యశ్యామలం

- తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం జిల్లా గౌరవ అధ్యక్షుడు సారంగపాణి


బొగ్గులవాగును సందర్శిస్తున్న తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం నాయకులు

ములుగు రూరల్ : ములుగు జిల్లాలో ఐదు ప్రాజెక్టులను నిర్మించినట్లయితే జిల్లా సస్యశ్యామలంగా మారుతుందని తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం జిల్లా గౌరవ అధ్యక్షుడు సారంగపాణి అన్నారు. ఆదివారం తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం ఆధ్వర్యంలో ప్రాజెక్టుల సందర్శన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని సర్వాపూర్ – జగ్గన్నగూడెం వద్ద బొగ్గులవాగుపై, గోవిందరావుపేట మండలం మచ్చాపూర్‌కు రామప్ప చెరువ నీటిని, తాడ్వాయి మండలంలోని నర్సాపూర్ వద్ద గొ నానం వాగు, వాజేడు మండలంలోని మోడికుంట వద్ద ప్రాజెక్టులు నిర్మాంచాలని, వెంకటాపురం మండలంలోని పాలెం ప్రాజెక్టు నుంచి కాలువలు ఏ ర్పాటు చేసి రైతాంగానికి నీటిని అందించాలని అ న్నారు. ములుగు ప్రాంతంలో వర్షాలు కురిసినప్పుడు నీరు వృథాగా పోతుందని వర్షాలు తగ్గిన క్రమంలో పంటలకు నీరు లేక రైతులు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. పంటలు నష్టపోకుండా ప్రాజెక్టులు, డ్యాంలు ఏర్పాటు చేయాలని అన్నారు. కార్యక్రమంలో నాయకులు జంపాల రవీందర్, బండి నర్సయ్య, ఎండి.అమ్జద్ పాషా, ఇంజం కొమురయ్య, ముత్యాల రాజు, నారాయణసింగ్, మంకిడి కృష్ణ, రామారావు, సాంబయ్య, శ్రీనివాస్, లక్ష్మయ్య పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో హనుమాన్ శోభాయాత్ర


చల్వాయిలో హనుమాన్ శోభాయాత్రలో హనుమాన్ స్వాములు

గోవిందరావుపేట : హనుమాన్ మాలధారణ చేసిన స్వాములు మండలంలోని చల్వాయి గ్రామంలో గురుస్వాములు మూల కుమార్, బిజ్జే సురేశ్ ఆధ్వర్యంలో హనుమాన్ చిత్రపటంతో శోభాయాత్రను ఆదివారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. శోభాయాత్ర కోసం ప్రత్యేకంగా అలంకరించిన రథంపై వీర హనుమాన్ పటంను చేర్చారు. ఈ సందర్భంగా ఆంజనేయుడి వేషధారణలతో భక్తులు స్వాములతో కలిసి శోభాయాత్రలో భక్తులు భజన, పాటలతో ఊరేగింపులో పాల్గొన్నారు. గ్రామంలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. వందలాది మంది భక్తుల కోలాహలం మధ్య శోభాయాత్ర సాగింది. ఎండ వేడిమిని కూడా లెక్క చేయకుండా భక్తులు శోభాయాత్రలో పాల్గొన్నారు.

యువత డ్రగ్స్‌కు దూరంగా ఉండాలి

- పస్రా ట్రెయినీ ఎస్సై ఆంజనేయులు


చల్వాయిలో డ్రగ్స్‌పై అవగాహన కల్పిస్తున్న ట్రెయినీ ఎస్సై ఆంజనేయులు

గోవిందరావుపేట: యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని, మత్తుకు బానిసై తమ జీవితాలను నాశనం చేసుకోవద్దని పస్రా ట్రెయినీ ఎస్సై కే.ఆంజనేయులు అన్నారు. మండల పరిధిలోని చల్వాయి గ్రామంలోని గ్రామ పంచాయతీ ఆవరణలో ఆదివారం గ్రామంలోని యువతకు డ్రగ్స్‌పై అవగాహన కల్పించారు. అనంతరం గ్రామంలోని వ్యాపారులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ యువకులు తమ జీవితాలు బాగు పడాలన్నా.. నాశనం కావాలన్నా టీనేజ్ లైఫ్ ఒక మలుపు అన్నారు. యవ్వనంలో బుద్ధిగా చదువుకొని చెడుఅలవాట్లకు దూరంగా ఉంటే వారి జీవితం బాగు పడుతుందన్నారు. మాదక ద్రవ్యాల అక్రమ రవాణా, దుర్వినియోగంపై చేస్తున్న పోరాటంలో అందరూ భాగస్వాములు కావాలన్నారు. మత్తుతో జీవితాలు చిత్తు చేసుకోవద్దని, మాదక ద్రవ్యాల నిర్మూలన మన అందరి బాధ్యత అని అన్నారు. డ్రగ్స్ అమ్మకం, కొనుగోలు చేసే వ్యక్తుల సమాచారం తెలిసిన వెంటనే పోలీసులకు తెలపాలన్నారు. వ్యాపారస్తులు మేము సైతం కార్యక్రమంలో భాగస్వాములు కావాలి అని అన్నారు. ప్రతి వ్యాపారి వారి షాపు ముందు సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలి అని అన్నారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, గ్రామస్తులు, వ్యాపారస్తులు పాల్గొన్నారు.

కోతలు విధిస్తున్న మిల్లులపై చర్య తీసుకోవాలి


ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సందర్శిస్తున్న చంద్రయ్య

వెంకటాపురం (ఎం): వరి ధాన్యం కోతలు విధిస్తున్న రైస్ మిల్లులపై కఠిన చర్యలు తీసుకోవాలని అఖిల భారత కిసాన్ ఫెడరేషన్ రాష్ట్ర కోశాధికారి గుండబోయిన చంద్రయ్య డిమాండ్ చేశారు. ఆదివారం వెంకటాపురం(ఎం) మండలంలోని ఇంచెన్ చెరువుపల్లిలో ఐకేపీ కొనుగోలు కేంద్రాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వరిధాన్యం కొనుగోలు చేస్తున్న ఐకేపీ సెంటర్ నిర్వాహకులు ధాన్యం తరలించిన క్రమంలో మల్లికార్జున రైస్‌మిల్లు యజమానులు క్వింటాకు 5 నుంచి 7 కిలోల వరకు కోతలు విధిస్తూ రైతులను ఇబ్బందులు పెడుతున్నారని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ధాన్యం కోతలు విధించకుండా దిగుమతులు చేసుకోవాలని చెప్పిన మిల్లరు మాత్రం వినడం లేదని అన్నారు. కోతలు విధిస్తున్న రైస్ మిల్లర్ల పై జిల్లా కలెక్టర్ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రైస్‌మిల్లర్ల దోపిడీని అరికట్టడంలో విజిలెన్స్, సివిల్ సప్లయ్ అధికారులు విఫలమయ్యారని అన్నారు. కార్యక్రమంలో నాయకులు రాస రాజన్న, రవి, సంజీవయ్య, సక్రునాయక్, సామిల్‌నాయక్, పస్సయ్య, రాజు, రైతులు పాల్గొన్నారు.

ఎయిడ్స్‌ను నిర్మూలించాలి


క్యాండిల్ ర్యాలీలో పాల్గొన్న మారి సంస్థ ప్రతినిధులు, ఆశ వర్కర్లు

భూపాలపల్లిరూరల్ : 2030 నాటికి ఎయిడ్స్‌ను పూర్తిగా నిర్మూలించి ఎయిడ్స్‌లేని దేశం చేయాలనే సంకల్పంతో ప్రతీ ఒక్కరికి హెచ్‌ఐవీ స్థితి తెలుసుకునేలా మిషన్–95 కార్యక్రమం చేపట్టినట్లు సంస్థ ప్రాజెక్ట్ మేనేజర్ గోపగాని సదానందం సూచించారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖ, దిశ, మారి స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం అంతర్జాతీయ ఎయిడ్స్ మృతుల స్మారకార్థం ఈ సంవత్సరం ఎయిడ్స్ రోగుల పట్ల మానవత్వం అనే నినాదంతో జిల్లా ప్రధాన ఆస్పత్రిలో క్యాండిల్ లైట్ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో స్థానిక ఆశ కార్యకర్తలు, మారిసంస్థ కార్యకర్తలు, స్థానిక బ్లడ్‌బ్యాంకు టెక్నీషియన్ బత్తిని శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

దూరం తెలిసేదెలా..?

- మైల్‌స్టోన్స్ ఏర్పాటు చేయని అధికారులు
- ఇబ్బందులు పడుతున్న భక్తులు


కాళేశ్వరం మార్గంలో అన్నారం క్రాస్ వద్ద లేని ఎలాంటి సూచిక బోర్డు

కాటారం : పవిత్ర పుణ్యక్షేత్రమైన కాళేశ్వరంలో కొనసాగుతున్న సరస్వతి నది పుష్కరాలకు వచ్చే భక్తులు సరైన మార్గం, దూరం తెలియక అయోమయానికి గురవుతున్నారు. మహదేవపూర్ నుంచి కాళేశ్వరం వరకు అధికారులు ఎక్కడ కూడా దూరాన్ని తెలిపే మైల్‌స్టోన్స్, మార్గ సూచికలు ఏర్పాటు చేయలేదు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లోని పలు ప్రాంతాల నుంచి కాళేశ్వరంలో జరిగే పుష్కరాలకు అధిక సంఖ్యలో ప్రైవేట్ వాహనాల్లో వస్తున్నారు. వారికి కాళేశ్వరం వెళ్లే దారి తెలియకపోవడంతో పాటు కనీసం ఎంత దూరం ఉందనే సమాచారం సైతం తెలియడం లేదు. దీంతో వారు మార్గం మధ్యలో ఆరా తీసుకుంటూ గమ్యం చేరుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. పుష్కరాలకు పూర్తి ఏర్పాట్లు చేశామని పలుమార్లు చెప్పుకొచ్చిన అధికారులు కనీసం జాతీయ రహదారిపై సూచిక బోర్డులు ఏర్పాటు చేయడం శోచనీయం అని పలువురు అంటున్నారు.

వనం రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభం

- రూ. 1.30 కోట్ల మంజూరుకు కృషి చేసిన మంత్రి సీతక్క


వనం రోడ్డుపై నిర్మిస్తున్న కల్వర్టు

ఎస్‌ఎస్‌తాడ్వాయి : మండలంలోని మేడారంలో రూ. 1.30 కోట్లతో వనం రోడ్డు నిర్మాణం పనులు ప్రారంభమయ్యాయి. రోడ్డు నిర్మాణానికి ప్రభుత్వం రూ.1.30 కోట్ల నిధులను మంజూరు చేసింది. పీఆర్‌శాఖ ఆధ్వర్యంలో రోడ్డు నిర్మాణం పనులు మొదలయ్యాయి. 420 మీటర్ల పొడవున 24 ఫీట్ల విస్తీర్ణంతో సీసీ రోడ్డు నిర్మించనున్నారు. రోడ్డు ఫార్మేషన్ పనులు, వనం రోడ్డుపై కల్వర్టు నిర్మిస్తున్నారు. గతంలో కిలోమీటర్ మేరకు రోడ్డు నిర్మించారు. మిలిగిన రోడ్డు గుట్ట రాళ్లతో అధ్వానంగా ఉంది. మంత్రి సీతక్క మేడారం అభివృద్ధి పనుల్లో భాగంగా వనం రోడ్డు నిర్మాణంపై దృష్టిసారించి ప్రభుత్వం నుంచి నిధుల విడుదలకు కృషి చేశారు. దీంతో వనం రోడ్డు పూర్తిగా అభివృద్ధి చెందనుంది.

పూజారులకు తప్పనున్న తిప్పలు

వనం రోడ్డు అభివృద్ధితో పూజారులకు తిప్పలు తప్పనున్నాయి. ప్రతీ రెండేళ్లకోసారి జరిగే మహాజాతరలో చిలకలగుట్టపై నుంచి సమ్మక్కతల్లిని గద్దెపై తీసుకురావాడానికి ముందుగా పూజారులు పడిగాపూర్ అటవీ ప్రాంతం నుంచి వనం రోడ్డు మార్గాన కంకవనాన్ని తీసుకెళ్లి సమ్మక్క గద్దెపై ప్రతిష్ఠించడం ఆనవాయితీ. అయితే రోడ్డు కొంత మేరకు బాగు లేకపోవడంతో పూజారులు ఇబ్బందులు పడేవారు. వనం రోడ్డును అభివృద్ధి చేయాలని పూజారులు గత ప్రభుత్వ పాలకులను, అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. మంత్రి సీతక్క మేడారం జాతర అభివృద్ధి పనులపై ఇప్పటికే ప్రత్యేక దృష్టిసారించారు. ఈసారి మహాజాతరకు ముందుగానే రోడ్లతోపాటు భక్తులకు కావాల్సిన శాశ్వత పనులను పూర్తి చేయాలనే లక్ష్యంగా ప్రభుత్వం నుంచి నిధులు మంజూరుకు కృషి చేస్తుంది. ఇప్పటికే మేడారంలో రూ. 15 కోట్లతో రోడ్ల అభివృద్ధి పనులను పూర్తి చేశారు. ఊరట్టం నుంచి కాల్వపల్లి వరకు బీటీ రోడ్డు నిర్మాణం పనులు కూడా త్వరలో ప్రారంభం కానున్నాయి. మేడారంలో భక్తుల క్యూలైన్లపై జీఐ షీట్స్‌తో షెడ్ల నిర్మాణం పనులు కూడా సాగుతున్నాయి. ఈసారి మహాజాతరకు రెండు నెలలు ముందుగానే శాశ్వత అభివృద్ధి పనులన్నీ పూర్తి చేయాలని మంత్రి సీతక్క అయాశాఖల అధికారులను ఆదేశించారు. ఇటీవల ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు మేడారంలో భక్తుల తాగునీటి కోసం ట్యాంకుల నిర్మాణాల కోసం స్థలాలను పరిశీలించి కావాల్సిన నిధుల మంజూరుకు ప్రతిపాదనలు సిద్ధం చేసినట్లు తెలిసింది.

బావిలో దూకి వ్యక్తి ఆత్మహత్య

మొగుళ్లపల్లి: మతిస్థిమితం కోల్పోయిన వ్యక్తి బావిలో దూకి ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండల కేంద్రంలో ఆదివారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. మొగుళ్లపల్లి గ్రామానికి చెందిన రామగిరి నవీన్(36) 12 ఏళ్ల నుంచి మతిస్థిమితం కోల్పోయి ఎలాంటి పనిచేయకుండా ఇంటి వద్దే ఉంటున్నాడు. కాగా శనివారం మధ్యాహ్నం సమయంలో కుటుంబ సభ్యులకు చెప్పకుండా బయటికి వెళ్లాడు. గమనించిన కుటుంబ సభ్యులు ఆచూకీ కోసం వెతుకుతున్న క్రమంలో ఆదివారం ఉదయం మండల కేంద్రం శివారులోని సమ్మక్క గద్దెల సమీపంలోని పెద్దవాగులో ఉన్న బావిలో శవమై తేలాడుతూ కనిపించాడు. మృతుడు మతిస్థిమితం కోల్పోయి జీవితంపై విరక్తి చెంది బావిలో దూకి ఆత్మహత్య చేసుకున్నాడని తండ్రి రామగిరి సర్వేశం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై అశోక్ తెలిపారు.

వాటర్ బాటిల్ రూ.30

భూపాలపల్లి అర్బన్: మహాదేవపూర్ మండలం కాళేశ్వరంలో తాగునీటి బాటిళ్లను అధిక ధరలకు అమ్ముతున్నారు. లీటర్ వాటర్ బాటిల్ రూ.20 ధర ఉండగా దానికి రూ.10 పెంచి అదనంగా రూ.30కి విక్రయిస్తున్నారు. వేసవికాలం కావడంతో సరస్వతి పుష్కరాలకు వచ్చే భక్తులు తాగునీటికి ఇబ్బంది పడుతున్నారు. వేసవి తాపానికి వాటర్ బాటిళ్లను అధిక ధరలకు కొనుగోలు చేయక తప్పడం లేదు.

మంత్రికి అభివృద్ధిపై పట్టింపు లేదు

- మహాముత్తారం బీజేపీ మండల అధ్యక్షుడు పూర్ణచందర్


రహదారిపై ఆందోళన చేస్తున్న బీజేపీ నాయకులు

కాటారం: రాష్ట్ర మంత్రి శ్రీధర్‌బాబుకు మహాముత్తారం మండల అభివృద్ధిపై ఏ మాత్రం పట్టింపులేదని ప్రభుత్వం ఏర్పడి 18 నెలలు అయినా మంత్రి మండలానికి రాకపోవడం దానికి నిదర్శనం అని మహాముత్తారం బీజేపీ మండల అధ్యక్షుడు మేడిపల్లి పూర్ణచందర్ ఆరోపించారు. నిమ్మగూడెం నుంచి కనుకునూర్ వరకు రహదారి పూర్తి చేయాలని డిమాండ్ చేస్తూ ఆదివారం బీజేపీ ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టారు. రోడ్డుపై బైఠాయించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా పూర్ణచందర్ మాట్లాడుతూ గత ప్రభుత్వంలో అటవీశాఖ నుంచి స్పష్టత వచ్చినప్పటికీ ఇప్పటి వరకు నూతన రోడ్డు నిర్మాణం చేపట్టకపోవడం ప్రభుత్వాల నిర్లక్ష్యానికి నిదర్శనమన్నారు. మంత్రికి సొంత మండలంపై ఉన్న శ్రద్ధ మహాముత్తారం మండలంపై లేదని ఈ విషయాన్ని కాంగ్రెస్ నాయకులు గమనించుకోవాలని హితవు పలికారు. ఇప్పటికైనా కాంగ్రెస్ నాయకులు మంత్రిపై ఒత్తిడి తెచ్చి రహదారి నిర్మాణం చేపట్టేలా చూడాలని పూర్ణచందర్ పేర్కొన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు కల్వచర్ల రాజు, జాడి రమేశ్, సిల్వరాజ్, వంశీనాయక్, నితీన్, శేఖర్, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

దాడి చేసిన వ్యక్తిపై కేసు నమోదు

భూపాలపల్లి రూరల్ : భూపాలపల్లి ఆర్టీసీ డిపోకు చెందిన ఆర్టీసీ డ్రైవర్‌పై దాడి చేసిన వ్యక్తిపై కేసు నమోదైనట్లు పోలీసులు ఆదివారం తెలిపారు. బాధితుడి కథనం ప్రకారం.. ఆర్టీసీ డ్రైవర్ తోట రాజేందర్ ఈనెల 16న భూపాలపల్లి టూ ఆజంనగర్ విధులకు బయలుదేరగా మార్గమధ్యలో నాగారం సమీపంలో బస్సుకు ఎదురుగా వచ్చిన ద్విచక్ర వాహనదారుడైన తాజొద్దీన్‌తో గొడవ జరిగింది. ఇద్దరి మధ్య మాటామాట పెరుగగా తాజొద్దీన్ డ్రైవర్ రాజేందర్‌ను చితకబాదాడు. దాడి విషయమై డ్రైవర్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తునట్లు పోలీసులు తెలిపారు.

చెట్ల కింద భక్తుల భోజనాలు


చెట్ల కింద భోజనాలు చేస్తున్న కుటుంబ సభ్యులు

భూపాలపల్లి అర్బన్ : కాళేశ్వరం సరస్వతీ పుష్కరాలకు వచ్చిన భక్తులు చెట్ల కింద వంటలు చేసుకొని భోజనాలు చేస్తున్నారు. వివిధ ప్రాంతాల నుంచి సొంత వాహనాలు, ఆర్టీసీ బస్సుల్లో తరలివచ్చిన భక్తులు పుష్కర స్నానాలు ఆచరించిన అనంతరం గ్రామ సమీపంలోని అడవిలో, ఆర్టీసి బస్టాండ్ సమీపంలో చెట్ల కింద వెంట తెచ్చుకున్న భోజనాలు, కొంత మంది వంటలు చేసుకొని తింటున్నారు. కుటుంబ సభ్యులు, బంధువులు కలిసి సహపక్తి భోజనాలు చేస్తు సంతోషంగా గడుపుతున్నారు.